క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కృత్తివెన్ను: రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ మంగళవారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. లక్ష్మీపురం లాకు సెంటర్ నుంచి మధ్యాహ్నం బస్సు సర్వీసును ప్రారంభిస్తారన్నారు. అనంతరం కృత్తివెన్నులో ఏర్పాటు చేసిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

ఏడో రోజుకు చేరిన పైడమ్మ సంబరాలు



పెడన: పట్టణంలో వేం చేసి ఉన్న శ్రీపైడమ్మ అమ్మవారి దేవస్థానం నందు పైడమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు సోమవారంతో ఏడో రోజుకు చేరాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఇళ్ల వద్ద శిడిబండ్లను ఏర్పాటు చేసికుని వాటికి బొమ్మలు కట్టి సుందరంగా తీర్చిదిద్ది మేళతాళాలతో, డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా బయలుదేరి ఆలయానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ, దేవదాయ శాఖ ఈవో మోహనరావు పర్యవేక్షణలో సిబ్బంది పటిష్ట ఏర్పాట్లు చేశారు.

ఎస్ఐగా ఎంపికైన నవీన్‌కు సన్మానం



మోపిదేవి: కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించనప్పటికీ స్వయంకృషితో అనుకొన్న లక్ష్యాన్ని సాధించిన గోవాడ నవీన్ నేటి యువతకు స్ఫూర్తిగా నిలిచారని గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి దళితవాడకు చెందిన నవీన్ ఇటీవల ఏపీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో ఎస్ఐగా ఎంపికయ్యారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం కేక్ కట్‌చేసి ఎస్ఐగా ఎంపికైన నవీన్‌ను సన్మానించారు. నందిగం అభిషేకరావు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు లింగం జగదీష్‌కుమార్, నందిగం శ్రీనివాసరావు, కర్లపూడి ఆదిశేషు, ఇస్మాయిల్, బాబూరావు, రవి పాల్గొన్నారు.

నేటి నుంచి పెంచిన పింఛన్ల పంపిణీ

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లు రూ.2,750 నుంచి రూ.3 వేలు పెంచిన పింఛన్ల పంపిణీని మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రారంభిస్తారని ఎంపీడీవో కె.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పింఛన్లను అందజేస్తామన్నారు.

సందడిగా సందె గొబ్బిళ్ల పేరంటం



చల్లపల్లి: ధనుర్మాసం సందర్భంగా సోమవారం స్థానిక గీతామందిరంలో సందె గొబ్బిళ్ల పేరంటం నిర్వహించారు. శ్రీకృష్ణ పరమాత్మకు విశేష అలంకరణతో పూజలు చేశారు. తిరుప్పావై పాశుర విన్నపాలు సమర్పించారు. తీర్థగోష్ఠి నిర్వహించారు. వరదా నాగమణి, కొల్లిపర నళిని, వేముల అనూష, సంఘ కార్యదర్శి వరదా హరిగోపాల్, సతీష్, సాంబశివరావు పాల్గొన్నారు.

డ్రోన్లతో ఎరువుల పిచికారీతో ప్రయోజనాలు



ఏటిమొగ(నాగాయలంక): మండల పరిధిలోని ఏటిమొగ, ఎదురుమొండి గ్రామాల్లో వికసిత్ భారత సంకల్ప యాత్ర(వీబీఎస్‌వై) గ్రామసభలు సోమవారం ఈఓపీఆర్డీ కె.అప్పలనరసమ్మ ఆధ్వర్యంలో జరిగాయి. ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించే దిశగా సభలు నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. మండల వ్యవసాయ అధికారి అన్నలూరి సంజీవరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో డ్రోన్ల సహాయంతో వ్యవసాయం చేపడితే రైతులకు కలిగే విస్తృత ప్రయోజనాలు, ప్రకృతి వ్యవసాయంతో రైతులకు, ప్రజలకు కలిగే మేలు వివరించారు. ఈ సందర్భంగా డ్రోన్లతో ఎరువులు, విత్తనాలు పిచికారీ చేసే విధానాలపై డెమో ప్రదర్శించారు. క్యాలెండర్లు, వికసిత్ భారత్ యాత్ర ఆవశ్యకతను చాటే బ్రోచర్లు ఆవిష్కరించి, ప్రతిజ్ఞ చేయించారు. వైద్య శిబిరాలు నిర్వహించారు. డాక్టర్ ఫాతిమున్నీసా, సర్పంచ్‌లు, వ్యవసాయ సహాయకులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు



పెడనలో కేక్ కట్ చేస్తున్న మంత్రి జోగి రమేష్, శకుంతలాదేవి, రాజీవ్



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ, కార్పొరేటర్లు



మంత్రి జోగి రమేష్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీవో వాణి



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



జెడ్పీ చైర్‌పర్సన్ హారిక, రాము దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు



ఎమ్మెల్యే పేర్ని నాని, కిట్టులకు శుభాకాంక్షలు తెలుపుతున్న నగర పోలీస్ అధికారులు



ఎమ్మెల్యే సింహాద్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ మురళీధర్, అధికారులు

పెడన: మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి నుంచి ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి. వాడవాడలా అన్ని వర్గాల ప్రజలు కేకులు కేట్ చేసి పంపిణీ చేయడంతో పాటు స్వీట్లు పంచుకోని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజలు ఆనందోత్సాహాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, శకుంతలాదేవి, జోగి రాజీవ్ కుటుంబ సభ్యులు అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తల నడుమ మంత్రి కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సోమవారం వేడుకలు నిర్వహించారు. మంత్రి జోగి రమేష్‌కు పెడన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికపాటి చారుమతి, రామానాయుడు దంపతులు, ఎంపీపీ వాణి, అచ్యుతరావు దంపతులు, మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, ప్రసాద్ దంపతులు పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అన్ని మండలాలకు చెందిన రాజకీయ పార్టీల నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. మచిలీపట్నం ఆర్డీవో వాణి, డీఆర్డీఏ పీడీ పి.శివరామ్‌ప్రసాద్, సమగ్రశిక్ష అభియాన్ ఏపీసీ కె.రాములునాయక్, మచిలీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీ పెడన సీఐ హబీబ్‌బాషా, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆయా ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

జెడ్పీ చైర్‌పర్సన్ స్వగ్రామంలో..

కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, రాము దంపతులు మండలంలోని కూడూరు స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం కేక్ కట్ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులు వారికి మిఠాయిలు తిని పించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పెడన పట్టణంలోని దివంగత నాయకుడు రాంప్రసాద్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కృష్ణాజిల్లాతో పాటు ఎన్టీఆర్ జిల్లాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీడీవోలు, జెడ్పీ కార్యాలయం అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

● మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాజులపాటి వాణి, అచ్యుతరావు దంపతులకు ఎంపీఈవో వి.రెడ్డయ్య, ఈవోపీఆర్డీ జయరాంలతో పాటు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చారుమతి, వెంకటరామానాయుడు దంపతులకు ఆ కార్యాలయ అధికారులు, సిబ్బంది, కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కృత్తివెన్నులో వేడుకలు

కృత్తివెన్ను: మండల వ్యాప్తంగా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత యువకులు బాణాసంచా కాల్చుతూ, కేకులు కట్ చేసి సందడి చేశారు. సోమవారం ఉదయం ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులకు అభిమానులు, అధికారులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరులో వేడుకలు

గూడూరు: మండల కేంద్రమైన గూడూరులో ఆదివారం రాత్రి 12 గంటలకు యువకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కేకులు కట్ చేసి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నూతన సంవత్సరాన్ని స్వాగతం పలుకుతూ మహిళలు తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పర్ణం పెదబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు మంత్రి జోగి రమేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసేందుకు తరలివెళ్లారు.

ఆనందోత్సాహాలతో వేడుకలు

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలు నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆదివారం రాత్రి నగరంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రైలుపేటలోని బేతేలు ప్రార్థనా మందిరంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) పాల్గొన్నారు. ఆ సంఘ కాపరి నేరెళ్ల వాల్టర్స్ ప్రేమ్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేశారు.బందరుకోట, గిలకలదిండి చర్చిలతో పాటు బైపాస్‌రోడ్డులోని జీజీఎం చర్చి, ఈడేపల్లిలోని ది పెంతుకోస్తు మిషన్ చర్చి, మాచవరంలోని జియోన్ చర్చిల్లో జరిగిన ప్రార్థనల్లో పేర్ని కిట్టు పాల్గొని పాస్టర్ల ఆశీర్వాదం పొందారు. ఈ పర్యటనలో పేర్ని కిట్టు వెంట నగర పాలకసంస్థ కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, కార్పొరేటర్ మీర్ అస్గర్ అలీ, నాయకులు బందెల థామస్‌నోబుల్, బూరగ రామారావు, గాజుల భగవాన్, హాజరై కేక్ కట్ చేశారు. మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలో పాస్టర్ తంటిపూడి ప్రభాకరరావు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

నగరంలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఉద్యోగులు, ప్రజలు పుష్పగుచ్ఛాలు పండ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, పలువురు కార్పొరేటర్‌లకు ఆయా డివిజన్ల ఉద్యోగులు, కార్యకర్తలు, ప్రజలు శుభాకాంక్షలు తెలిపారు. నగర కమిషనర్ జి.చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ జ్యోతిలక్ష్మి, ఎంఈ శ్రీకాంత్‌లకు ఉద్యోగులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పలు చర్చిల్లో వేడుకలు

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని కోటగిరిలంక ఆర్సీఎం చర్చి ప్రాంగణంలో నూతన సంవత్సర వేడుకలతో పాటు పరిశుద్ధ కన్య మరియ దివ్య మాత మహోత్సవం, ఏసు నామకరణ ఉత్సవాలను విచారణ గురువు సురేష్ మెర్లో ఘనంగా జరిపారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఫాదర్ గొరుముచ్చు క్రీస్తురాజు మరియమాత జీవిత విశేషాలను వివరించారు. ఫాదర్ సురేష్ మాట్లాడుతూ.. ఎన్నో కష్టాలు, ఇబ్బందులు అనుభవించిన మరియమాత జీవితం ప్రతి మహిళకు ఆదర్శనీయమన్నారు. స్థానిక బెతేల్, ఎల్‌ఈఎఫ్, హోసన్నా, ఆర్సీఎం, సీబీసీఎన్‌సీ, కృపాసన ప్రార్థనా మందిరాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

నాగాయలంక: మండల వ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. తొలుత అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరి ప్రసాద్, వక్కపట్లవారిపాలెం సర్పంచ్ అంబటి శ్యామ్‌ప్రసాద్ ఉదయాన్నే ఎమ్మెల్యే రమేష్‌బాబును కలిసి శుభాకాంక్షలు చెప్పారు. ఎంపీపీ భోగాది రాఘవరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది వెంకట శేషగిరిరావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అవనిగడ్డ వెళ్లి ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీటీసీ మోకా బుచ్చిబాబు, ఎంపీటీసీ మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కన్వీనర్ మద్ది చిన్నారి, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, రేపల్లె రామ్మోహనరావు, జిల్లా యూత్ కార్యదర్శి ఆకుల బాబికుమార్ తదితరులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటి ముంగిట గృహిణులు, యువతులు హ్యాపీ న్యూ ఇయర్‌కు స్వాగతం పలుకుతూ అర్ధరాత్రి వరకు తమ గృహాల ముంగిట తీర్చిదిద్దిన ముగ్గులు విశేషంగా అలరించాయి. చిన్నారులు రంగవల్లులకు రంగులు అద్ది సందడి చేశారు.

కోడూరు: ఆదివారం రాత్రి యువకులు బాణాసంచా కాల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇళ్ల వద్ద ప్రజలు కుటుంబసమేతంగా న్యూ ఇయర్ కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు ఇళ్ల ముంగిట్లో అందమైన రంగవల్లులు తీర్చిదిద్ది నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సోమవారం కోడూరు మండల పరిషత్ కార్యాలయంలో వేడుకలను నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ అధికారులుతో కలిసి కలిసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నేతలు న్యూ ఇయర్ వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంపీడీఓ శ్రీనివాసరావుకు పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి పూలబోకేలు అందించారు. కోడూరు పోలీస్ స్టేషన్, పాలకాయతిప్ప మెరైన్ పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది వేడుకలు జరిపారు.

ఎమ్మెల్యే పేర్ని నానికి శుభాకాంక్షల వెల్లువ

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని)కి సోమవారం పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని నానితో పాటు ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ యువజన విభాగ జోనల్ ఇన్‌చార్జి వారి గృహం వద్ద ప్రజలకు అందుబాటులో ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే పేర్ని నాని, పేర్ని కిట్టు లకు పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, పూలమొక్కలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొంత మంది స్వీట్ ప్యాకెట్లు, పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఇచ్చి, దుశ్శాలువాలు, గజమాలలతో సత్కరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు, ఎంయుడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని, వీసీ రాజ్యలక్ష్మి, నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, నాగేశ్వరరావు దంపతులు, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా కుటుంబ సభ్యులు, నగర మెప్మా, ఐసీడీఎస్, రెవెన్యూ, పోలీస్, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలైన యూటీఎఫ్, ఏపీటీఎఫ్ తదితర సంఘాల నాయకులు, అధికారులు పేర్ని నానిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ టీఎఫ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీవీ చంద్రశేఖరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి తోట సాంబశివరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.శివశంకర్, జిల్లా అధ్యక్షుడు ఎంవీ మహంకాళరావు, నాయకులు పేర్ని నాని, కిట్టులను కలిసి సంఘ క్యాలెండర్, డైరీని ఆవిష్కరింపజేశారు. ఏపీ ఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఉల్లి కృష్ణ, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, కార్పొరేటర్లు తెచ్చిన భారీ కేక్‌ను పేర్ని నాని, కిట్టు కట్ చేశారు. మాజీ కౌన్సిలర్ సజ్జా అంకినీడు కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ పడమట రేవతి, రమేష్ దంపతులు, చిలకలపూడి నాయకులు పేర్ని నానిని గజమాలతో సత్కరించారు.

అవనిగడ్డలో వేడుకలు

అవనిగడ్డ: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు భారీ కేక్‌ని కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. డీఎస్పీ మురళీధర్‌తో పాటు ఆరు మండలాలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఎమ్మెల్యే సింహాద్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బొకేలు, దండలు తీసుకురావద్దని ఎమ్మెల్యే ముందుగా చెప్పడంతో విద్యార్థులకు ఉపయోగ పడేలా నోటు పుస్తకాలు, పెన్నులు, పరీక్ష అట్టలు, జామెట్రీ బాక్సులు తీసుకొచ్చి ఎమ్మెల్యేకి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో ఎం.మరియాదేవి, ఈవోపీఆర్డీ శైలజాకుమారితో పాటు పలువురు మహిళా ఎంపీటీసీలు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఏపీ సర్పంచ్‌ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పాపారావు కేక్ కట్ చేసి అభిమానులకు పంచారు.



కోడూరులో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గూడూరులో కేక్ కట్ చేస్తున్న తలుపుల వెంకట కృష్ణారావు తదితరులు



కోటగిరిలంక ఆర్సీఎం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాదర్స్ సురేష్, క్రీస్తురాజు



ఎంపీపీ వెంకటకుమారికి శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారులు



ఎమ్మెల్యే సింహాద్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న పార్టీ శ్రేణులు

ఆలయాల్లో 'నూతన' శోభ



కోడూరులో ప్రత్యేక అలంకారంలో వెంకటేశ్వరస్వామి

కోడూరు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో మూలమూర్తులు విశేష అలంకారంలో దర్శనమిచ్చారు. స్వామివారి దర్శనకోసం ప్రజలు బారులు తీరారు. ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి, హంసలదీవి వేణుగోపాలస్వామివారి ఆలయాల్లో కూడా న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు. శ్రీమన్నారాయణుడి 11 అడుగుల ఏకశిలా మూలమూర్తికి తులసీదళాలతో అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణాలను వివిధ రంగవల్లులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

సుబ్బారాయుడు సన్నిధిలో..

మోపిదేవి: దేశంలోని ప్రజలందరినీ సుఖశాంతులతో చల్లంగా దీవించాలని భక్తులు కార్తికేయ స్వామివారిని వేడుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మోపిదేవిలో వేంచేసియున్న శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని తెలుగు ఉభయ రాష్ట్రాలతో పాటు పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు సోమవారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు ఆనందోత్సాహాలతో ఉండాలని స్వామివారికి విన్నవించుకున్నారు. పలు ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం పునరుద్ధరణ

పెడన: పట్టణంలోని శ్రీ బొడ్డునాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలకు పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రీజినల్ ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్ పి.రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన కళాశాలను పరిశీలించి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం కావడమే కాకుండా ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా విజ్ఞప్తులు, ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిపై విచారణ నిర్వహించి, పరీక్ష కేంద్రానికి తగ్గ సౌకార్యాలున్నదీ లేనిదీ పరిశీలించామని చెప్పారు. సౌకర్యాలు బాగానే ఉన్నాయని, అందువల్ల ఇక్కడ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రవికుమార్ తెలిపారు. కృష్ణా జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి, కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ఆర్వీ ప్రసాద్ పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినందుకు రవికుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కళాశాల లైబ్రరీ సైన్స్ అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, వరుదు నిరంజన్, వెంకన్న, గిరి, గంగాధర్, ఉదయభాస్కర్, శిరీష పాల్గొన్నారు.

కలెక్టర్, జేసీలకు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



కలెక్టర్ రాజాబాబు, సుజాతలతో కేక్ కట్ చేయిస్తున్న జేసీ అపరాజితసింగ్, అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్‌లను పలువురు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు పుష్పగుచ్ఛాలు, మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ బంగ్లాలో తొలుత జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజా శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ దంపతులు రాజాబాబు, సుజాతలతో జిల్లా అధికారులు కేక్ కట్ చేయించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా నాగదుర్గాభవాని, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు జన్ను రాఘవరావు, ఏఎస్పీ శ్రీహరి, ఆర్డీవోలు ఎం.వాణి, పి.పద్మావతి, దాసి రాజు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, డీఈవో తాహెరాసుల్తానా, ట్రెజరీ డీడీ రవికుమార్, వ్యవసాయశాఖ అధికారి ఎన్.పద్మావతి, పరిశ్రమలశాఖ అధికారి ఆర్ వెంకట్రావు, టిడ్కో పీడీ చిన్నోడు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్రలీల, ఐసీడీఎస్ పీడీ ఎస్ సువర్ణ, డీఎంఅండ్‌హెచ్‌వో జి.గీతాబాయి, ఎంయుడీఏ వీసీ కె.రాజ్యలక్ష్మి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం.సునీత, డీసీవో ఫణికుమార్, మార్కెటింగ్ ఏడీ నిత్యానందం, సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరప్రసాద్, అటవీశాఖ అధికారి చంద్రశేఖర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో–ఆర్డినేటర్ సంతోష్ కుమార్, కలెక్టరేట్ ఏవో ఏఎస్‌ఎన్ రాధిక తదితరులు ఉన్నారు.

ఘనంగా మరియమాత మాతృత్వ పండుగ

లక్ష్మీపురం(చల్లపల్లి): చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు శివరామదుర్గాపురంలోని ఆర్సీఎం చర్చిలో సోమవారం మరియమాత మాతృత్వ పండుగ ఘనంగా నిర్వహించారు. మచిలీపట్నం ఆర్సీఎం చర్చి ఫాదర్ జోజిబాబు, సాలిపేట చర్చి ఫాదర్ రెవరెండ్ ఎం.జోసఫ్, ఫాదర్ పి.బాలస్వామి దివ్య బలిపూజ, సత్ప్రసాద ఆరాధన నిర్వహించారు. నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మరియదళ సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు. చల్లపల్లి, ఘంటసాల మండలాల నుంచి 12 గ్రామాల విశ్వాసులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

చల్లపల్లి: క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని అక్షయ ఫౌండేషన్ చైర్మన్ మాదివాడ వెంకట కృష్ణ(క్రిస్టియన్) అన్నారు. సోమవారం చల్లపల్లి, నాదెళ్ల వారిపాలెం జీజీఎం చర్చిల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెంకట కృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేసి శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు జి.ఏసురాజు, గోల్కొండ డేవిడ్ క్రీస్తు సందేశామిచ్చారు. పిల్లలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

చోరంపూడిలో అయోధ్య అక్షింతలు పంపిణీ

బంటుమిల్లి: మండల పరిధిలోని చోరంపూడి గ్రామంలో సోమవారం అయోధ్య అక్షింతల పంపిణీ కార్యక్రమాన్ని భక్తులు అంగరంగ వైభవంగా ప్రారంభించారు. విశ్వహిందూ పరిషత్ అందజేసిన అక్షింతలతో పాటు రాముడి చిత్రపటాలు, కరపత్రాలను భక్తులకు అందజేశారు. స్థానిక రామాలయం కమిటీ గ్రామ పెద్దలు పర్యవేక్షణతో ఆంజనేయ ఉత్సవ విగ్రహాన్ని ట్రాక్టరుపై ఉంచి మేళతాళాలతో రామనామం జపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఇంటి ముందు రంగులతో సుందరమైన ముగ్గులతో అలంకరించి అక్షింతలు కార్యక్రమానికి ఘన స్వాగతం పలికారు.